సాక్షి ఏలూరు

మంగళవారం । 26 । మార్చి । 2024




క్షీరారామంలో చండీ హోమం

పాలకొల్లు సెంట్రల్ : పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం జరిపించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ సూర్యనారాయణ పర్యవేక్షించారు.



కొల్లేరులో చెరువు గట్లు ధ్వంసం

ఆగడాలలంక రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిర్మించిన కొల్లేరు కాంటూరు చెరువు గట్లను అధికారుల సమక్షంలో నిర్వాహకులే స్వచ్ఛందంగా ధ్వంసం చేశారు. 8లో



	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
ఏలూరు	6.25	4.42
భీమవరం	6.22	4.44

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి మల్లికార్జునరావుకు జ్ఞాపిక అందిస్తున్న డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం సందర్శించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు న్యాయమూర్తికి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ పి.నటరాజారావు ఉన్నారు.

ఎలక్ట్రానిక్ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

ఏలూరు(మెట్రో): ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్–మోనిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు. పెయిడ్ న్యూస్, రాజకీయ ప్రకటనలను తనిఖీ చేసేందుకు జిల్లాస్థాయులో ఎంసీఎంసీ కమిటీని నియమించామన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత రెండు రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఈసీ నిబంధనలను పాటించాలన్నారు. వార్తల ముసుగులో రాజకీయ పార్టీలు అన్నిరకాల మీడియాల్లో ఇచ్చే ప్రకటనలను ఎంసీఎంసీ స్క్రూటినీ చేస్తుందన్నారు. ఎంసీఎంసీ మోనిటరింగ్ సెల్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేశామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు ఉపేక్షించం: ఆర్డీఓ

నూజివీడు : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ వై.భవాని శంకరి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ జి.లక్ష్మయ్యతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించేటప్పుడు 48 గంటల ముందు అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోడ్‌ను ఎవరూ అతిక్రమించినా ఆర్డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చెయ్యాలన్నారు. కోడ్ ఉల్లంగించిన అభ్యర్థులకు ముందుగా నోటీసులు ఇస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దస్థాయిలో నిర్వహించే వేడుకలకు సైతం అనుమతి తీసుకోవాలన్నారు. కోడ్ పరిరక్షణకు ఆరు బృందాలతో గస్తీ తిరిగేలా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. న్యూస్ చానల్స్, ప్రింట్ మీడియాలో ప్రచురితమయ్యే పెయిడ్ ఆర్టికల్స్ పైనా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వ్యక్తిగత వాహనాలపై స్టిక్కర్లు అంటించినా, ఇళ్లపై జెండాలు కట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మామిడి ఫలసాయానికి 28న వేలం

నూజివీడు: నూజివీడు మామిడి పరిశోధన స్థానం ఆవరణలోని 485 మామిడి చెట్ల ఫలసాయానికి ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి సోమవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం అనంతరం మిగిలిన వారి డిపాజిట్ల నగదు వాపసు చేస్తామన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు తోటను తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. పాటదారుడు పాట మొత్తంలో సగం సొమ్మును వేలం పూర్తయిన వెంటనే చెల్లించాలని, ప్రతి చెట్టు ఫలసాయాన్ని విడిగా లెక్క చెప్పాల్సి ఉంటుందన్నారు. సబ్‌లీజుకు ఇవ్వడానికి వీల్లేదని, ప్రతి చెట్టుకు ఐదు కాయలను పాటదారుడు పరిశోధనల నిమిత్తం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

అక్రమ రవాణాకు చెక్

- చెక్‌పోస్టులతో సరిహద్దులు పటిష్టం
- ఎన్నికల కోడ్‌తో మెరుపు దాడులు
- సారా, అక్రమ మద్యం, నగదు రవాణాపై నిఘా
- 8 రోజుల్లో 131 కేసుల నమోదు



ఏలూరు జిల్లా సరిహద్దు ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు, ఎస్‌ఈబీ సిబ్బంది

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమైంది. ఎన్నికల సంఘ ఆదేశాలతో ఏలూరు జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. ఓ వైపు ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణం కల్పించటంతోపాటు మరోవైపు నగదు, మద్యం, సారా, మత్తుపదార్థాల అక్రమ రవాణాకు 'చెక్' పెట్టేందుకు పటిష్ట చర్యలను అధికారులు చేపట్టారు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడ పడుతున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తూ ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిఘాను మరింత పెంచారు. ఎన్నికల్లో మద్యం, సారా ప్రభావాన్ని అరికట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది.

8 చెక్‌పోస్టుల ఏర్పాటు

జిల్లాకు సంబంధించి అంత రాష్ట్ర సరిహద్దు, జిల్లా సరిహద్దు ప్రాంతాల నుంచి నగదు, మద్యం, సారా, మత్తు పదార్థాల అక్రమ రవాణాకు అరికట్టేందుకు చర్యలు 8 చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఇందులో ఒకటి ఎస్‌ఈబీ చెక్‌పోస్టు కాగా, మిగిలిన ఏడు చెక్‌పోస్టుల వద్ద పోలీస్, సాయుధ బలగాలతో నిత్యం వాహన తనిఖీలు చేస్తున్నారు. చింతలపూడి మండలంలో ఆల్లిపల్లి, గురుభట్లగూడెం, టి.నరసాపురం మండలంలో లంకలపల్లి, జీలుగుమిల్లి మండలంలో తాటాకులగూడెం, వేలేరుపాడు మండలంలో మేడపల్లి, కుక్కునూరు మండలంలో శ్రీధర్‌వేలేరు, చాట్రాయి మండలంలో పర్వతపురం, కృష్ణారావుపాలెంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

కేసులు ఇలా..

నాటుసారా	41
అక్రమ మద్యం రవాణా	61
ఇతర రాష్ట్రానికి చెందిన మద్యం రవాణా	14
బెల్లపు ఊట తయారీ కేంద్రాలపై దాడులు	15

131 కేసులు

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి 131 కేసులు నమోదు చేశారు. ఒక్క ఆదివారం రోజునే జిల్లాలో ఏడుచోట్ల కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించటంతోపాటు అనుమానిత ప్రాంతాల్లో దాడులు, తనిఖీలు చేసి 19 కేసులు నమోదు చేశారు. జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి మొదటి ఎనిమిది రోజుల్లో 131 కేసులు నమోదు చేయడంతో పాటు 23 వేల లీటర్ల బెల్లపు ఊట, 446.76 లీటర్ల రాష్ట్ర మద్యం, 87.9 లీటర్ల ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం, 650 లీటర్ల నాటుసారాను ఎస్‌ఈబీ, పోలీస్ బృందాలు స్వాధీనం చేసుకున్నాయి.

నిత్యం తనిఖీలు



జిల్లావ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాం. రాష్ట్ర, జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుతో పాటు నిత్యం వాహన తనిఖీలు, మెరుపుదాడులు చేసే లా చర్యలు తీసుకున్నాం. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్, సాయుధ బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. నేరాలకు పాల్పడే వారిపై మరింత నిఘా పెంచటంతోపాటు, అక్రమ రవాణాకు చెక్ పెట్టేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నాం. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సహించం.

– డి.మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

నిఘా మరింతగా..



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిఘాను మరింత పెంచాం. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో టాస్క్‌ఫోర్స్ బృందాలు నిత్యం దాడులు చేసేలా ఆదేశాలు జారీ చేశాం. సారా, అక్రమ మద్యం నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకున్నాం. జిల్లావ్యాప్తంగా రోజూ కార్డెన్ సెర్చ్‌లు, మెరుపు దాడులు చేస్తూ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింత పెంచాం.

– నక్కా సూర్యచంద్రరావు, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ, ఏలూరు

ఉల్లంఘనలపై నిరంతర నిఘా

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు, వారి వినతుల స్వీకరణకు వివిధ వ్యవస్థలను అందుబాటులో ఉంచారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేసేందుకు, ఎన్నికల ప్రక్రియపై నిరంతర నిఘా కోసం, వివిధ విభాగాలతో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో సీ-విజిల్, కాల్ సెంటర్ 1950 హెల్ప్‌లైన్ తదితర విభాగాలు పనిచేస్తున్నాయి. కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నేతృత్వంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి పర్యవేక్షిస్తున్నారు. సీ–విజిల్ కంప్లయింట్ సెల్‌కు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం, సోషల్ మీడియాకు ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ పర్యవేక్షణాధికారులుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాస్థాయి కాల్ సెంటర్ 1800 233 1077కి ప్రజలు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చు. ఇది 24 గంటలూ పనిచేస్తోంది. అలాగే ఎన్‌జీఎస్ పోర్టల్, సాక్ష్యం యాప్, మీడియా మోనిటరింగ్ సెల్, రిపోర్ట్స్ మోనటరింగ్ సెల్ పనిచేస్తున్నాయి. రిపోర్ట్స్ మోనటరింగ్ విభాగాన్ని జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పరిశీలన నోడల్ అధికారులు సైతం ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి



పోలవరంలో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషిగా చేయాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరంలో సోమవారం మండల స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి మరిన్ని సేవలు అందిస్తానన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తొలి రెండేళ్లు కరోనాతో తీవ్ర ఇబ్బందులు ఎదురైనా ప్రజలకిచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ అన్ని పథకాలు అందించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో తన భార్య తెల్లం రాజ్యలక్ష్మి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, ఆమెను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. సమన్వయంతో పనిచేసి రాజ్యలక్ష్మిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మండలంలో అన్ని కమిటీల సభ్యులు ప్రచారాల్లో పాల్గొని ఇంటింటికీ తిరిగి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలపై తెలియజేయాలని కోరారు. ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనమలూరు అవకాశవాదిని పారదోలండి



నూజివీడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మంత్రి పదవి ఇవ్వలేదని పార్టీ మారి నూజివీడు వచ్చిన పెనమలూరు అవకాశవాదిని నియోజకవర్గ ప్రజలు పారదోలాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలో వీధివీధినా పర్యటించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించి జగన్‌ను సీఎం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి ఇవ్వనప్పుడు నైతిక విలువలు ఉన్న వ్యక్తి అయితే రెండేళ్ల క్రితమే ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోవాలని, అలా కాకుండా ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా నూజివీడుకు వలస పక్షిలా వచ్చాడన్నారు. పెనమలూరులో టికెట్ ఇచ్చేందుకు ఏ పార్టీకి పనికిరాని వ్యక్తి నూజివీడు ప్రజలకు ఎలా పనికివస్తాడో అందరూ ఆలోచించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగించిన సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో రోడ్లు అభివృద్ధి చేసినా, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినా అది తన హయాంలోనే అని గుర్తు చేశారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రూ.21.15 కోట్లతో కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా నూతన భవనాన్ని నిర్మించామన్నారు. నియోజకవర్గంలో 15 వేల మంది పేదలకు స్థలాలను మంజూరు చేయడంతో పాటు పక్కా ఇంటి నిర్మాణానికి సాయం అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థిగా తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ రజియాబేగం, దాసరి మారుఅప్పాజీ, నవుడు నాగమల్లేశ్వరరావు, పగడాల సత్యన్నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు గుణపాఠం తప్పదు



అల్లూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అడ్డదారిలో అధికారంలో చేజిక్కించుకునేందుకు ముందుకు వచ్చే ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని అల్లూరు, బొమ్మినంపాడు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ వైఎస్సార్‌సీపీ పాలనలో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. దీనిని భగ్నం చేసేందుకు ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. అధికారం కోసం అమలుకాని వాగ్దానాలు ఇస్తూ ప్రజల ముందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు అందుబాటులో లేని నాయకులతో నియోజకవర్గానికి ఒరిగేదేమి లేదన్నారు. కుల, ధనబలంతో ఓట్లను కొల్లగొట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ పాలనలో కైకలూరు నియోజకవర్గం పూర్తి అధోగతిపాలు కాగా వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. గ్రామాల్లో సచివాలయ భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాడు–నేడు పనులతో రూపుమారిన ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయన్నారు. ఆక్వా రైతుల సమస్యలను సీఎం జగన్ సహృదయంతో పరిష్కరించారన్నారు. ఆక్వాకు విద్యుత్ సబ్సిడీ అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, అల్లూరు సర్పంచ్ శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్‌బాబు, నాయకులు ఉన్నారు.

భవిష్యత్‌లో మరింత అభివృద్ధి



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

దెందులూరు: ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో మరింత అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. సోమవారం రాత్రి మేధినరావుపాలెం, ధర్మారావుపేట, కొవ్వలివారిగూడెంలో మేము సిద్ధం–మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌తో కలిసి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ మేధినరావుపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుని రూపురేఖలు మారుస్తానని అన్నారు. సీఎం జగన్ విద్య, వైద్యం, రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి పెద్దపీట వేశారని, నవరత్నాల పథకాలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేశారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పాలన చేరువ చేశారన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా, ఎంత మంది కలిసి వచ్చినా మరోమారు ముఖ్యమంత్రి అయ్యేది సీఎం జగనే అన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలను నమ్మవద్దని హితవు పలికారు. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థిగా తనను, ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరిని గెలిపించాలని కోరారు. మరోసారి మోసం చేయడానికి అన్ని పార్టీలు కలిసి వస్తున్నాయని, గత టీడీపీ హయాంలో, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలును బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు.

మండుతున్న ఎండలు



మార్చిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మండుతున్న ఎండలతో బెంబేలెత్తిస్తున్నాడు. ఎండ తాకిడికి మధ్యాహ్నం 12 గంటల తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఏలూరులో సోమవారం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. ఏలూరులో కనిపించిన దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

హోలీ.. ఆనందాల కేళి





జిల్లావ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్దా రంగులు చల్లుకుంటూ, డీజే మ్యూజిక్‌లతో ఆనందంగా ఉత్సవాలు జరుపుకున్నారు. సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో హోలీ సంబరాల దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెదపాడు: అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఒక మహిళ మృతి చెందిన ఘటన పెదపాడు మండలంలోని వసంతవాడలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం వసంతవాడకు చెందిన పోలగాని నాగరాజు భార్య ఉషారాణి(27)తో రోజు తాగొచ్చి గొడవపడేవాడు. ఈ నెల 24న కూడా భార్యను కొట్టి గాయపర్చాడు. మనస్తాపం చెందిన ఆమె పక్కనే ఉన్న పులవర్తి ఫణీంద్ర ఇంటి ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం అందడంతో పంచనామా చేసి పోస్టుమార్టంకు మృతదేహాన్ని తరలించారు.



బుట్టాయగూడెం: జీలుగుమిల్లి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ



ఉంగుటూరు: మండలంలోని సరిపల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

అడుగడుగునా నిఘా



కామవరపుకోట: కొత్తూరులో తనిఖీలు నిర్వహిస్తున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తనిఖీలు ముమ్మరం చేశారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాలు ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పోలవరం నియోజకవర్గ పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పటిష్టం చేశారు. తెలంగాణ సరిహద్దు నుంచి అక్రమంగా మద్యం, నగదు రవాణాకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. అక్రమ నగదు ప్రవాహానికి చెక్ పెట్టేలా జిల్లాలోని ప్రతి మండలంలో పోలీసు అధికారులు వాహనాల్ని ఆపి తనిఖీ చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కైకలూరు జనసేనకే కేటాయించాలి

- ఎన్నికల ముందు వచ్చేవాళ్లకు సీటు కేటాయిస్తే ఊరుకోం
- కామినేని తీరుపై జనసైనికుల కన్నెర్ర

కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు సీటుపై కూటమిలో పోరు తారా స్థాయికి చేరింది. బీజేపీ సీటు ప్రకటించకముందే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల అభ్యర్థిని అంటూ గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్‌కు జనసేన నుంచి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం ప్రకటించిన 21 సీట్లలో కైకలూరు నియోజకవర్గం లేదు. దీంతో ఈ సీటు ఆశిస్తున్న బీవీ రావుతో కలసి జనసేన నేతలు కైకలూరు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ జనసేన నేతలు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, కోట విప్లవ వరప్రసాద్, నాగనబోయిన విజయ్‌కుమార్, మోరు విజయరాజు, నాగదేశి గణేష్ బాబు, నర్రా ప్రభు, శివరామకృష్ణ యాదవ్‌లు కైకలూరు సీటును జనసేనకే కేటాయించేలా పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో ఉంటూ ఎన్నికల ముందు పదవుల కోసం వచ్చేవాళ్లకు సీటు కేటాయిస్తే ఎలా అంటూ పరోక్షంగా కామినేని శ్రీనివాస్‌నుద్దేశించి విమర్శించారు. బీసీ కులానికి చెందిన విద్యావంతుడైన యువకుడు బీవీ రావు 2019లో జనసేన తరఫున పోటీ చేసి ఓటమి చెందారని, అప్పటి నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అలాంటి వ్యక్తిని కాదని సీటును బీజేపీకి కేటాయిస్తే వ్యతిరేకిస్తామని హెచ్చరించారు.



కైకలూరు జనసేన ఇన్‌చార్జి బీవీ రావుతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

జనసేనలో రెండు వర్గాలు

నియోజకవర్గంలో జనసేన నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. బీవీ రావు కార్యాలయం, గాంధీబొమ్మ సెంటర్ వద్ద తోట లక్ష్మికి చెందిన మరో కార్యాలయం ఉంది. బీవీ రావు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. పొత్తుల్లో భాగంగా తోట లక్ష్మి, కొల్లి బాబి, నల్లగోపల చలపతిరావు కామినేనికి మద్దతుగా ఉన్నారు. ఇప్పటికే ఆయనతో పాటు ప్రచారంలో పాల్గొంటున్నారు. జనసేన తరఫున సీటు ఆశిస్తున్న బీవీ రావు మాత్రం గ్రామాల్లో జనసేన జయభేరి పేరుతో పర్యటిస్తున్నారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు



బహుమతి అందుకున్న విద్యార్థిని అభినందిస్తున్న చిత్రం

తాడేపల్లిగూడెం: జాతీయస్థాయి పోటీల్లో ఏపీ నిట్ విద్యార్థులు బహుమతులు సాధించారు. పూనెలో జరిగిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌లో నిట్‌కు చెందిన నలుగురు విద్యార్థులు వేర్వేరు కేటగిరీలలో రెండు బహుమతులను అందుకున్నారు. మెటలర్జికల్ మెటీరియల్స్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి రాఘవరపు పార్థసారథికి ఉత్తమ పేపర్ ప్రజంటేషన్ అవార్డు దక్కింది. పౌడర్ మెటలర్జికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏటా జాతీయస్థాయిలో సదస్సు నిర్వహించి పరిశోధక ఆచార్యులను, విద్యార్థుల ప్రతిభ గుర్తించి ప్రోత్సహిస్తుంది. మెకానికల్ అల్లోయింగ్ ఆఫ్ హై ఎంట్రోపీ అల్లాయిస్‌పై పేపర్ ప్రజంటేషన్ ఇచ్చారు,. ఈ ప్రజంటేషన్‌కు నిర్వాహకులు అవార్డుతో పాటు రూ.5 వేల నగదును ఇచ్చారు. ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి వి.జయంత్, పి.భాను, కె.దీక్షితలు శశి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమంలో మైక్రో కంట్రోలర్‌ను ఉపయోగించి ఎలక్ట్రికల్ వాహనాల్లో తక్కువ ధర బ్యాటరీ, నిర్వహణ వ్యవస్థ, ఆరోగ్యస్థితిని అంచనా వేయడం అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు అవార్డుతో పాటు నగదు బహుమతిని అందుకుంది.

నేడు మిజోరాం గవర్నర్ రాక

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు హాజరుకానున్నారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ చెప్పారు. 26న ఉదయం 10 గంటలకు నిర్వహించే వార్షికోత్సవానికి హరిబాబు హాజరై విద్యార్థులకు పతకాలు అందిస్తారన్నారు.

నోబెల్ వరల్డ్ రికార్డుకు ఎంపిక



నోబెల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన క్రీడాకారులతో కరాటే మాస్టర్లు

తణుకు అర్బన్: తణుకులో కేఎస్ మార్షల్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మార్షల్ ఆర్ట్ ప్రదర్శనలో కరాటే క్రీడాకారులు సత్తా చాటారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా నోబెల్ వరల్డ్ రికార్డ్స్ కోసం ఆ సంస్థ ఏర్పాటుచేసిన మార్షల్ ఆర్ట్స్‌లో 234 మంది క్రీడాకారులు పాల్గొని తమకు నిర్దేశించిన 1872 వాటర్ బెలూన్స్‌ను బ్లాస్ట్ చేశారు. క్రీడాకారుల ప్రదర్శన అద్భుతమని నోబెల్ వరల్డ్ రికార్డు ఎడిటోరియల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ హేమలత అన్నారు. నోబెల్ వరల్డ్ రికార్డులో క్రీడాకారులు స్థానం సంపాదించారని స్పష్టం చేస్తూ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌ను అభినందించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుండెపోటుతో ఉపాధి హామీ పథకం కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని మెట్ట ఉప్పరగూడెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మర్లపూడి సులోమాన్ రోజు సోమవారం ఉపాధి హామీ పథకం పనులకు వచ్చాడు. పనిచేస్తుండగా గుండె పోటు రావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. గతంలో సులోమాన్ భార్య నాగలక్ష్మి రోడ్డు ప్రమాదంలో, కుమారుడు రాజేష్ కోవిడ్‌తో మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం కోడలు, వారి పిల్లల ఆలనా పాలనా చూస్తూ పెద్ద దిక్కుగా సులోమాన్ నిలిచాడు. ఆయన మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

వైభవంగా డోలా పౌర్ణమి వేడుకలు



తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న శ్రీవారు, అమ్మవార్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో సోమవారం డోలా పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా ఉదయం, రాత్రి వేళల్లో ఉభయదేవేరులతో శ్రీవారు తొళక్క వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వెండి తొళక్క వాహనంపై ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చారు. ఆ తర్వాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా తిరువీధులకు పయనమైంది.

ఏలూరులో కొత్త సినిమా షూటింగ్



ఆర్‌వీ స్టూడియోస్ ప్రొడక్షన్ నెంబర్1 చిత్ర షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్‌వీ స్టూడియోస్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మించనున్న ప్రొడక్షన్ నెంబర్ వన్ చిత్రం ముహూర్తపు షాట్‌ను ఏలూరులోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం తీశారు. పూజా కార్యక్రమాల అనంతరం నలుగురు స్నేహితుల మధ్య సంఘటనా దృశ్యాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఆర్. విజయరాజు మాట్లాడుతూ మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్న ఆర్‌వీ స్టూడియోస్ అధినేత రవికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సినీ నిర్మాత, దర్శకుడు, రచయిత దాసరి రవికుమార్ మాట్లాడుతూ నూతన నటీనటులతో ఈ సినిమా తీస్తున్నట్లు చెప్పారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి ఆత్మహత్య

ఉంగుటూరు: ఫత్తేపురం గ్రామానికి చెందిన రావూరి సాయికుమార్(30) నాచుగుంట కోటాడ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికుమార్ సీతారామపురంలో వడ్రంగి పనిచేసి చేస్తుంటాడు. భార్యభర్తల మధ్య గొడవ నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు చెబుతున్నారు. సునీల్‌కుమార్ మృతదేహం కోటాడ చెరువులో తేలియాడడం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మణికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య గొడవ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక

భీమవరం: జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అత్యున్నత ప్రదర్శనతో రాణిస్తున్నారని బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అన్నారు. ఏప్రిల్ 6, 7 తేదీల్లో గోవాలో నిర్వహించే జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీలకు రాష్ట్ర టీం సెలక్షన్స్ భీమవరం పట్టణంలోని కే12 జిమ్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రంలోని బాడీబిల్డర్లు మరిన్ని పతకాలు సాధించే దిశగా ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ కృషిచేస్తుందన్నారు. అనంతరం జాతీయస్థాయి మిస్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, అధ్యక్షుడు స్వామి రమేష్‌కుమార్, జిల్లా జాయింట్ సెక్రెటరీ వలవల ఫణి, గోవర్ధన్, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీల రాష్ట్ర జట్టు

కొల్లేరులో అక్రమ చెరువు గట్ల ధ్వంసం

భీమడోలు: ఆగడాలలంక రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిర్మించిన కొల్లేరు కాంటూరు చెరువు గట్లను సోమవారం అటవీ శాఖ అధికారుల సమక్షంలో నిర్వాహకులే స్వచ్ఛందంగా ధ్వంసం చేశారు. పొక్లెయిన్ సాయంతో గట్లను తొలగించి చదువు చేశారు. కొల్లేరు కాంటూరు పరిధి ఆగడాలలంక రెవెన్యూ పరిధిలోని లక్ష్మీపురం చెక్‌పోస్టు పక్కనే ఉన్న టైటానిక్ చెరువును 2006 కొల్లేరు ఆపరేషన్‌లో ధ్వంసం చేశారు. 2018లో ఎస్సీ సొసైటీ పెద్దలు 50 ఎకరాల విస్తీర్ణంలోని ఆ చెరువును పునరుద్ధరించుకుని అక్రమంగా చేపల సాగు చేస్తున్నారు. ఇటీవల గట్లు దెబ్బతినడంతో మరమ్మత్తులు చేపట్టే పనులకు ఉపక్రమించారు. అటవీశాఖ అధికారులు అడ్డుకున్న పెద్ద సంఖ్యలో గ్రామస్తులు రాత్రి వేళల్లో పొక్లెయిన్ సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. ఆటవీశాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో పోలీసులకు వివరాలను అందించారు. అటవీశాఖ సెక్షన్ అధికారిణి పాపారత్నం, బీట్ అధికారి శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లో ఆ చెరువు గట్లను స్వచ్ఛందంగా తొలగించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో గట్లను ధ్వంసం చేశారు. కాంటూరు పరిధిలో అక్రమంగా చెరువులు తవ్వినా, మరమ్మతులు చేపట్టినా కేసు నమోదు చేస్తామని రేంజర్ టి.సాయి తెలిపారు.



పొక్లెయిన్ సాయంతో చెరువు గట్టు తొలగిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

పెదవేగి: పెదవేగి మండలం చక్రాయగూడెంలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం వేగివాడకు చెందిన మారగాని వీర వెంకట సత్యనారాయణకు తల్లి శేషారత్నం, భార్య పద్మ, ఇద్దరు పిల్లలున్నారు. తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో సత్యనారాయణ తల్లితో కలిసి, ఐదుగురు చెల్లెళ్లను పెంచి పెళ్లిళ్లు చేశాడు. వేగివాడ సెంటర్లో హోటల్ నిర్వహిస్తున్న సత్యనారాయణ వద్ద ఆదివారం రాత్రి కొంతమంది టిఫిన్ చేసి, ఫోన్‌పేలో సొమ్ము చెల్లించి వెళ్లిపోయారు. మొత్తం రూ.150 కాగా, ఫోన్ పేలో రూ.15లే చెల్లించడంతో తన సోదరి చిడిబొమ్మ మణి, కుమార్తె పురందేశ్వరితోపాటు ద్విచక్రవాహనంపై ఏలూరు వైపు వెళ్తున్న వ్యక్తులను కిలోమీటరు వెంబడించి తిరిగి వేగివాడ వస్తున్నారు. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. సత్యనారాయణ (48) అక్కడికక్కడే మృతి చెందగా, అతని సోదరి, కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు కారును వెంబడించి కారు నడుపుతున్న శిరుగుబత్తుల నవీన్‌తో పాటు మరో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సత్యనారాయణకు 9వ తరగతి చదువుతున్న కుమార్తెతోపాటు దివ్యాంగుడైన కుమారుడు ఉన్నాడు.



సత్యనారాయణ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సత్యనారాయణ